# చీకటి

"అమ్మా, కొంచెం సాయం రావూ!" అర్ధరాత్రి ఒంటి గంటకు లేచి అడిగేవాడిని. అమ్మ విసుక్కునేది కాదు కానీ - "పదిహేనేళ్ళు దాటుతున్నా చీకటంటే భయం పోలేదు. ఎలా బ్రతుకుతాడో వెర్రినాయన" అని జాలిపడేది.

అమ్మ అన్న ఈ మాటల్లో వింత లేకపోవచ్చు కానీ ఆ మాటలు నాలో చాలా పట్టుదలను కలిగించాయి. ఎలాగైనా చీకటిని జయించాలని అనుకునే వాడిని. కానీ మళ్ళీ రాత్రి పన్నెండు దాటిందంటే గుమ్మం దాటి బయటకు కదలాలంటే అమ్మ సాయం పొందవలసిందే. ఎందుకో తెలియదుగానీ, భయపడకూడదనుకుంటూనే చీకటికి భయపడిపోతూండేవాడిని.

కానీ చీకటంటే తర్వాత తర్వాత నాకు పట్టుదల ఎక్కువయింది. అందుకు కారణం వసుంధర. ఆమె నాకు మేనత్త కూతురు. వరుసకు మరదలవుతుంది. చీకటంటే నేను భయపడతానని తెలియగానే, 'సిగ్గులేదూ, చెట్టంత మగాడివి' అంటూ వేళాకోళం చేసింది

ఆమె ఆ మాటలను యధాలాపంగానే అని ఉండవచ్చు. కానీ సురుచి అన్న మాటలు ధృవుడి మీద పనిచేసినట్లుగా ఆ మాటలు నా మీద బాగా ప్రభావం చూపాయి. నా కంటే చిన్నది -- నన్ను హేళన చేయడం నాకు అవమాన మనిపించిది.

అయితే నన్ను ధృవుడితో పోల్చుకోవడం లేదు. ఎందుకుంటే నేను తొక్కిన దారి వేరు.

అదంతా పదిహేనేళ్ళ క్రితం సంగతి. ఇప్పుడు.....

చీకటంటే అప్పుడంతగా ఎందుకు భయపడేవాడినో నాకు అర్థం కాదు. పైగా చీకటంటే ఇప్పుడు నాకు చాలా ఇష్టం. నిజం చెప్పాలంటే, ఇప్పుడు నేను పగలంటే భయపడతాను. చీకటికీ, నా జీవితానికి ఏదో తెలియని సంబంధం ఉంది. ఎందుకుంటే...

చీకటి బజారు నాకు చాలా డబ్బు సంపాదించి పెడుతోంది. చీకటి తప్పులు నాకు కలిగించే ఆనందాన్ని మరింకేవీ కలిగించలేకపోతున్నాయి. అసలు - చీకటి అనేది భగవంతుడు మనకు ప్రసాదించిన వరం అనిపిస్తుంది నాకు.

తప్పు చేయడంలో గొప్ప ఆనందం ఉంది. అయితే ఆ తప్పు నలుగురికీ తెలియకుండా చేయగలిగినప్పుడే ఆ ఆనందం నిలుస్తుంది. తప్పును మరుగుపరిచే శక్తి చీకటికి ఉంది. కాబట్టి చీకటి మనకు ఎంతో అవసరం.

చీకటే ఇప్పుడు నా జీవనాధారం. అయితే నేనిలా మారడానికి ఆనాడు నన్ను వసుంధర వేళాకోళం చేయడమే కారణమని అనలేను. ఎందుకంటే ఆమె ఇప్పుడు నా

భార్య, నలుగురికీ తెలియకుండా నేను చేసే తప్పుల్లో చాలా వరకూ ఆమెకూ తెలుసును. అయితే ఆమె కూడా చీకటి వంటిదే. నా తప్పుల్ని నలుగురికీ తెలియకుండా కాపాడుతుంది. అందుకే నేను ఆమెను భార్యలా కాకుండా చీకటిలా చూస్తాను, చీకటి కంటికి కనిపించదు. వసుంధర కంటికి కనిపించినా నేను కనిపించనట్లుగానే భావిస్తాను.

వసుంధర నన్ను తప్పులు చేయవద్దని బ్రతిమాలుతూ ఉంటుంది. అయినా నాకా మాటలు తలకెక్కవు. ఏదో రేడియోలో సంగీతం వింటున్నట్లుగా వినేస్తాను. అంతే! అందుకే నాలోని మార్పుకి కారణం వసుంధర కాదని నా ఉద్దేశ్యం. ఒకవేళ అయినప్పటికీ, ఇప్పుడిక మార్పులు నాలో తేలేదు ఆమె! ఏ స్త్రీ అయినా, భార్య కానంత కాలమే గౌరవించగలం గానీ, భార్య అయ్యాక గౌరవించలేము. అలా గౌరవించడం అనవసరం కూడా. భార్యగా మారిన స్త్రీ మనలనింకేమీ చేయలేదు. మన్ని మెప్పించడానికే ప్రయత్నిస్తూ, ఏ క్షణంలో మనస్సు మార్చుకొని తన్నూ వదిలేస్తామోనని హడలిపోతూ దినదిన గండంగా బ్రతుకుతూంటుంది. భార్య మీద ఇవీ నా అభిప్రాయాలు.

నాకు చాలా రంగాల్లో ప్రవేశముంది. అనేక రకాల వ్యాపారాల్లో పెట్టుబడులున్నాయి, నాన్న గారు చేసినన్నాళ్ళూ, మా వ్యాపారం ఎప్పుడూ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉండేది. ఆయన నాకు వ్యాపారాన్ని అప్పజెబుతూ చెప్పిన మాటలు తలచుకున్నప్పుడల్లా నాకు నవ్వొస్తూనే ఉంటుంది. "చూడు బాబు నేనెంతో న్యాయంగా, ధర్మంగా ఈ బట్టల వ్యాపారాన్ని చేసుకుంటూ వచ్చాను. నీవూ ప్రాజ్ఞుడివి - బీకాం ప్యాసయ్యావు, నీకు నేను చెప్పవలసిందేమీలేదు. కానీ అన్యాయానికి మాత్రం పోకు. అన్యాయం మనకు అచ్చిరాదు."

ఆ మాటలకు నాకప్పుడే నవ్వొచ్చింది. డబ్బు సంపాదించడానికి న్యాయా న్యాయాలతో పని లేదు. తెలివి తేటలు ఉండాలి, తెలివితేటలు లేని వారు తొక్కే మార్గాన్నే న్యాయ మార్గమంటారని నా ఉద్దేశ్యం. ఉదాహరణకు తెనాలి రామలింగడి కథలు తీసుకుంటే - ఆయన చేసినవన్నీ మోసాలే. వాటిని అన్యాయమనడానికి బదులు తెలివితేటలంటున్నాము. కానీ హార్లిక్స్ సీసాలు స్టాకు చేసి దాచేసి చీకటి బజారులో ఎక్కువ వెలకు అమ్మితే అది అన్యాయమైపోయింది. వ్యాపారస్తుడి తెలివి తేటల కింద లెక్కించరు. అందుకే నాకు అన్యాయం మీద నమ్మకం లేదు. తెలివి తేటల మీదనే నా నమ్మకం.

నా ఇరవై రెండో ఏట నేను వ్యాపారంలో ప్రవేశించాను. రెండేళ్ళల్లో ఓ కాఫీ హోటలు వెలిసింది, మరో ఏడాదిలోనే ఓ పెద్ద ఫ్యాన్సీ అండ్ కిరాణా షాపు, మరో రెండేళ్ళల్లో ఓ సినిమా హాలూ, నగల షాపూ... అలా అలా తారస్థాయికి చేరుకున్నాను. ఇప్పుడు నాకు ముప్పైయేళ్లు. చూడ్డానికి పాతికేళ్ల కుర్రాడిలా ఉంటాను. కానీ వ్యాపారంలో నాకున్న ఒడుపు ఇంకెవ్వరికీ లేదని చాలా మంది పెద్ద పెద్ద వ్యాపారస్తులే ఒప్పుకున్నారు.

నా ఔన్నత్యం అమ్మకు సంతోషకారణమయింది. మా నాయనది అద్భుతమైన బుర్ర అంటూంటుంది. నాన్నగారు మాత్రం ఏమీ మాట్లాడరు. ఆయన నా వంక చూసే చూపులో ఏదో చిన్న అనుమానం కనిపిస్తూ ఉంటుంది. ఇటీవల నాకాయన నీతిబోధ చేయడం కూడా మానేశారు.

డబ్బులో గొప్ప నిషా ఉంది. తాగినకొద్దీ నిషా ఎక్కి బ్రాందీ ఎలా తాగాలనిపిస్తుందో ఖర్చు పెట్టిన కొద్దీ ఇంకా ఖర్చు పెట్టాలనీ, సంపాదించిన కొద్దీ ఇంకా సంపాదించాలనీ అనిపిస్తుంది.

డబ్బులో మరో విశేషముంది. ఊరికే నిలవలు పెంచి కూడ బెట్టాలనుకునే వాడి దగ్గర అది ఎంతో కాలం నిలవదు. దాన్ని అనుభవించాలి. ఖర్చు పెట్టిన కొద్దీ డబ్బు ఊరుతూ ఉంటుంది. అందరి విషయంలోనూ, ఈ సూత్రం ఎంతవరకూ నిజమో నాకు తెలియదు. ఇది కేవలం నా అభిప్రాయం. అందుకు కారణం కూడా నేను చెప్పగలను.

మనం డబ్బు ఖర్చు పెట్టడం మొదలు పెట్టామంటే, దానికి అంతుండదు. రకరకాల ఖర్చులు బయల్దేరుతాయి. మన దగ్గర డబ్బు ఖర్చవుతూంటే, ఖర్చు అయిన సొమ్ము మళ్లీ పూడ్చాలిగదా! అందుకోసం, బుర్ర పనిచేయడం మొదలుపెడుతుంది. ధనార్జనకు మరో ఉపాయం తడుతుంది. డబ్బు సంపాదించడంలో, ఖర్చు పెట్టే వాడి మెదడుకున్న చురుకుదనం, నిలవ్వేసేవాడి కుండదు.

డబ్బుంటే జనం మన చుట్టూ ఈగల్లా ముసురుతారు. నా చుట్టూ కూడా అలా చాలా ఈగలు ముసిరేవి. అయితే నేనా ఈగల్ని తోలేసేవాడిని. కానీ వాళ్ళలో కొందరు తేనెటీగల్ని ఏరి ఉంచే వాడిని. నేను రాణి ఈగగా వ్యవహరిస్తూ, ఈ తేనెటీగల్ని ఉపయోగించుకొని పట్టునిండా తేనె నింపేవాడిని. పట్టు పూర్తిగా నిండిన తర్వాత వాళ్లకు కొద్దిగా తేనె చూపించి మిగతాది నేను కాజేసేవాడిని.

చీకటి అనగానే నాకు కలిగే ఆనందానికి ముఖ్యకారణం స్త్రీలు. నిజంగా భగవంతుడనే వాడుంటే స్త్రీని సృష్టించిన ఒకే ఒక్క కారణానికి ఆయన్ను మెచ్చుకోవచ్చు. స్త్రీ అందించే ఆనందం, ఈ ప్రపంచంలో మరేదీ కూడా పురుషుడికి అందించలేదు. ఎన్నిసార్లు అనుభవించినా, ఎప్పటికప్పుడే ఏదో నూతనత్వం గోచరిస్తూ ఉంటుంది, స్త్రీ అందించే అనుభవంలో.

స్త్రీని ఒక వ్యక్తిగా చూడలేను నేను. ఏదో ఒక వస్తువుగా కనిపిస్తుంది నాకు. అనుభవయోగ్యమైన ఒక అద్భుతమైన వస్తువు స్త్రీ. డబ్బుతో కొనగలిగే అనేక రకాల వస్తువుల్లో అద్భుతమైనది స్త్రీ.

పచ్చని ఛాయ, సుమారైన పొడుగు, అకర్షణీయమైన ముఖమూ , చక్కని బిగి ఉన్న స్త్రీలంటే నాకెంతో ఇష్టం. అలాంటి స్త్రీలు డబ్బుకి దొరికితే వారి కోసం ఎంత ఖర్చుకయినా నేను వెనుదీయను. అందులో కొత్త అమ్మాయి కనిపించి నప్పుడు, ఎప్పుడు చీకటి పడుతుందా అని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది.

ఇది నా జీవన విధానం.

ఆ రోజు హఠాత్తుగా నాన్నగారికి గుండె నొప్పి వచ్చిందని కబురు రాగానే కంగారు పడి ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి ఆయనకు కొంచెం తేలిక పడింది. బాగానే ఉన్నారు.

"నేను మాత్రం కంగారుగా, "ఎలా ఉంది నాన్నగారూ!" అని అడిగాను.

"బాగానే ఉందిరా బాబీ!" అని ఆయన ఒక్క క్షణం ఆగి నాతో అన్నారు, "వ్యాపారాన్ని వృద్ధి చేసినందుకు చాలా సంతోషంగా ఉంది, కానీ ఒక్క విషయం మాత్రం మరచి పోవద్దని హెచ్చరిస్తున్నాను. మనిషికి డబ్బొక్కటే ప్రధానం కాదు, నీతి, న్యాయం, ధర్మం కూడా చూసుకోవాలి. డబ్బు అన్ని సమయాల్లోను ఉపయోగించదు. ఈ సంగతి బాగా జ్ఞాపకం ఉంచుకొని జాగ్రత్తగా మసలు కోకపోతే మాత్రం పతనమైపోతావు సుమా!"

నేను మౌనంగా విని మనస్సులోనే నవ్వుకున్నాను. 'డబ్బు విషయం నాన్నగారికేం తెలుసు? అది ఏం చేయాలన్నా చేయగలదు' - అనుకున్నాను.

ఆ సాయంత్రం నాన్నగారికి మళ్ళీ గుండెనొప్పి వచ్చింది. చాలా కంగారయ్యింది. హార్ట్‌స్పెషలిస్టుని తీసుకొచ్చాను కానీ లాభం లేకపోయింది. ఆయన మరణించారు. ఎందుకో నాకు అపుకోలేని దు:ఖం వచ్చింది. నేను అలా ఏడ్వడం నాకే ఆశ్చర్యం వేసింది.

ఏ వ్యక్తికయినా చనిపోయాక హోదా పెరుగుతుంది. నా అంతరంగంలో నాన్నగారి హోదా కూడా అలాగే పెరిగి, చివరి క్షణంలో ఆయన చెప్పిన మాటలు ఆలోచించవలసిన వేమో అనిపించింది. అన్నీ చేయగలదనుకున్న డబ్బు మనుషుల్ని బ్రతికించలేదని కూడా గ్రహించాను.

రోజులు గడుస్తుంటే నాన్నగారి జ్ఞాపకాలు క్రమంగా మరిచి పోగలుగుతున్నాను. కానీ ఇప్పుడు నా ఆలోచనా విధానం మాత్రం మారింది. ఇంతవరకూ ఒక తండ్రి చాటు బిడ్డగా వ్యవహరించాను. కానీ నాన్నగారు పోయేసరికి నాకూ ఒక రకమైన పెద్దమనిషి తరహా వచ్చింది. అందుకే ఈ రోజు కిరాణా షాపు వద్ద, కొట్లో గుమాస్తాకీ, ఓ అవ్వకూ జరిగిన సంభాషణ నన్ను కలవర పెట్టింది.

"బాబూ, హార్లిక్స్ ఉందా?" అని అడిగింది అవ్వ.

"ఉంది ఏడుం బావలా" అన్నాడు గుమాస్తా.

"అదేంటి బాబూ, మరీ అన్యాయంగా మాట్లాడుతున్నావు, కోఆపరేటివ్ స్టోర్సులో అయిదున్నరే అయితేనూ", అంది అవ్వ.

"పోయి అక్కడే కొనుక్కో, గుమాస్తా సమాధానం.

"అక్కడుంటే ఇక్కడికెందుకు వస్తాను?"

"ఇక్కడయితే ఏడుం బావలా, ఇష్టమయితే కొనుక్కో- లేకపోతే మానేయ్" అన్నాడు గుమాస్తా.

"మరీ అన్యాయం రోజులు వచ్చేశాయి. మా కన్యాయం చేసిన నువ్వూ, మీ యజమానీ ఏం బావుకుంటారో నేనూ చూస్తాన్లే," అని విసుక్కుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది అవ్వ.

ఆ విసుక్కోవడంలో నన్నింకా దారుణంగా తిట్టుకోవటం కనిపెట్టాను. నేను జనం నన్ను గురించి తిట్టుకుంటున్నారని గ్రహించేసరికి నాకు బాధే కలిగింది. అసలు జనం, నన్ను గురించి ఏమనుకుంటున్నారో తెల్సుకుందామనే కుతూహలం ఆనాడే నాలో ప్రారంభయింది. ఎదురుగా నన్ను పొగిడే చాలా మంది చాటుగా తిట్టుకుంటున్నారనీ, శాపనార్ధాలు పెట్టుకుంటున్నారనీ నేను గ్రహించాను. ఈ విషయం నాకు బాధ కలిగించక పోలేదు.

అయినా మనకు డబ్బే ప్రధానమైనప్పుడు ఎవరేమనుకుంటేనేం అనుకున్నాను. అప్పుడే నాకవగాహన అయింది. మనం కోరుకునే విధంగా గౌరవింపబడాలంటే డబ్బు ఉపయోగపడదు. మంచితనం అవసరం. అయినా అలా గౌరవించబడాలనే కోర్కె నాలో లేదు. అందుచేత మంచిగా ఉండాలని నేను ప్రయత్నించలేదు.

కానీ ఇటీవల నా ఆలోచనావిధానం ఇంకా మారిపోయింది. అందుక్కారణం బహుశా నాలోని అసంతృప్తి కావచ్చు. జీవితంలో అంతా కోరుకునేవి అనుభవించాను. అయితే నాలో అసంతృప్తికి కారణమేమిటో నాకే అర్థం కావడంలేదు.

ఇంటికి వెడితే వసుంధర కనిపిస్తుంది. చూడగానే ఆమెకు అన్యాయం చేస్తున్నానేమో అనిపి స్తుంది, ఆమె నా తప్పుల్ని వేలెత్తి చేపించి నన్ను తిడితే బాగుండుననిపిస్తుంది. కానీ ఆమె అలా చేయదు. నవ్వుతూ పలకరిస్తుంది. నాకు ఏమవసరమో చూస్తుంది. ఆరోగ్యం విషయం హెచ్చరిస్తుంది. ఆమె అలా మసలుతూంటే నన్నదోరకమైన అసంతృప్తి బాధిస్తుంది, అనుకోకుండానే నా మనస్సు నన్నామెతో పోలుస్తుంది, ఆమె ఔన్నత్యాన్ని గుర్తిస్తాను. నేనూ అలాగే ఉండగలిగితే....

కానీ -- ఉండలేను. చీకటి పడిందంటే నా మనస్సు విజృంభిస్తుంది. నాకు తెలియకుండానే నా వ్యవహారాల్లో లీనమైపోతాను. ఒక విధంగా చెప్పాలంటే నాకదొక వ్యసనంగా పరిణమించింది, కావాలనుకున్నా వదలలేను.

నాకు డబ్బు పెరిగే కొద్దీ నా గురించి చెడ్డగా చెప్పుకునే పుకార్లెక్కువయాయి, మనస్సు వాటికి అలవాటు పడలేక పదే పదే బాధపడుతూండేది. ఆ బాధతో నాకు తెలియని అసంతృప్తి కలిసి నన్ను మరింత బాధించసాగింది. ఇలా మానసికంగా నేను బాధ పడు తున్న సమయంలో గీతాతత్వం మీద ఎవరో స్వామి ఇస్తున్న ఉపన్యాసానికి అనుకోకుండా వెళ్లడం సంభవించిది. నాకా ఉపన్యాసమంతా అదోకలా అనిపించినా, ఒక వాక్యం మాత్రం నన్నాకర్షించింది. "చెడ్డ పనులు వేయి చేసినా లభించని సుఖమూ, సంతృప్తీ మంచి పని ఒక్కటి చేస్తే లభిస్తాయి."

ఈ వాక్యం నన్నాకర్షించడానిక్కారణం - బహుశా ఇది నన్నుద్దేశించినట్లుండడంవల్ల కావచ్చును. నేను చాలా చెడ్డ పనులు చేశాను. సుఖపడుతున్నానని భ్రమపడుతున్నానుగానీ సుఖం లేదు. సంతృప్తి అసలే లేదు. చేసిన మంచి పనులేవేమైనా ఉన్నాయో లేవో నాకు తెలియదు. చిన్న చిన్న మంచి పనులేమైనా ఉన్నా నా హోదాకు, డబ్బుకు తగ్గ మంచి పనులేమీ చేసి ఉండను. చేసి ఉంటే నాకు గుర్తుండేవి.

అందుకే, ఆ స్వామీజీ వాక్యం వినగానే నాకొక మంచి పని చేయాలని అనిపించింది. ఈ విషయం తట్టగానే మంచి ఏ విధంగా చేయాలా అని అనుమానం వచ్చింది. వెంటనే మా ఇంటి పక్కనున్న శాస్త్రిగారు గుర్తుకొచ్చారు. పాపం ఆ శాస్త్రిగారు చాలా పేదవాడు. ఏదో, గుమాస్తా ఉద్యోగం చేసుకుంటున్నాడు. వచ్చే డబ్బు తిండికే చాలదు. అటువంటి పరిస్థితుల్లో అయనకు ఎదిగి కూర్చున్న ఆడపిల్ల పెళ్ళిచేయడమెలాగ అన్న సమస్య ఒకటి. అప్పుడప్పుడు, నా దగ్గర తన కష్టాలు చూచాయగా వెళ్ళబోసుకునేవాడుగానీ, ఎప్పుడూ సహాయం కావాలని మాత్రం అర్థించలేదు.

నేను తలచుకుంటే, ఎంతసేపు - ఆ మర్నాడే శాస్త్రిగారు కనిపించగానే పిల్ల పెళ్ళికి సాయం చేస్తానని చెప్పాను. ముందాయన తబ్బిబ్బుపడి కాస్సేపు అభిమానపడ్డాడు, చివరికి ఆనందభరితుడై "మీ మేలు జన్మలో మరిచిపోలేను బాబూ!" అన్నాడు.

తోచినపుడు, ఉన్నపుడు తీర్చే షరతు మీద నోటు లేకుండా మాట మీద ఆయనకు అప్పిచ్చాను. డబ్బు చేతిలో పడేదాకా ఏమనుకున్నాడో గానీ డబ్బు చేతిలో పడేసరికి ఆయన ఆనందం పట్టనలవికాదు. కాళ్ళ మీద పడ్డ పర్యంతం చేసి, "మీవంటి సహృదయులుండబట్టే దేశం ఇంకా ఇలా ఉంది" అన్నాడు. ఒకసారి తన ఇంటికి వచ్చి ఇల్లు పావనం చేయాలని బలవంతం పెట్టాడు. వెళ్ళక తప్పలేదు.

ఆయనకు కలిగిన ఆనందమూ, నన్నాయన గౌరవించే విధానమూ చూస్తుంటే నాకు కలిగిన సంతృప్తి ఇంతా అంతా అని చెప్పలేను. స్వామీజీ మాటల్లో ఎంతో నిజం ఉంది. ఎన్నడూ కలగని తృప్తి ఆ రోజు కలిగింది.

అయితే నేనటువంటి సంతృప్తికి అర్హుణ్ణి కాదేమో. మంచి పని చేయాలనుకుంటే వచ్చేది కాదు, అది సహజంగా రావాలి, వెనుకటికి దుర్యోధనుడు దాతృత్వంలో కర్ణుడంత కావాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. సంపదలోనూ, వ్యసనాలలోనూ, నేను దుర్యోధనుడికి తీసిపోలేను.

శాస్త్రిగారింట్లో నన్ను జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేనంతగా గౌరవించారు. ఏదో గొప్ప సహాయం చేసినట్లుగా నన్ను స్తుతించారు. చివర్న ఆయన తన కూతుర్ని తీసుకొచ్చి "నమస్కరించమ్మా అయనకి" అన్నారు.

కళ్లు చెదిరాయి నాకు, శాస్త్రిగారికి భువనైక మోహిని వంటి కూతురు వుందని గానీ ఉంటుందని గానీ నేనూహించలేదు.

"చదువుకుంటోందా?" అని అడిగాను.

"స్కూలుఫైనలు ప్యాసయ్యాక మాన్పించేశాం."

"పేరు"

"మీనాక్షి"

తరువాత నేనింకేమీ మాట్లాడలేదు. శాస్త్రిగారేదో చెబుతున్నా నా తల కెక్కడంలేదు. మీనాక్షి అన్న పేరు నా తలలో తిరిగిపోతోంది.

అమె రూపం నా హృదయంలో ప్రతిష్టించుకు పోయింది.

సెలవు తీసుకొని వచ్చేశాను నేను. కానీ మీనాక్షి రూపం నా మనస్సులోనే నిలిచి నాతో పాటే వచ్చేసింది.

ఎలాగైనా ఆమెను అనుభవించాలి!

"ఆమెకు ధన సాయం చేసింది వివాహం గురించి. అటువంటప్పుడు ఆమెనాశించడం ఆన్యాయం కదూ" అని అంతరాత్మ నన్ను ప్రశ్నించింది. "నిజమే!" - తల వంచుకున్నాను. అంతలోనే అంతరాత్మకు జవాబివ్వగల శక్తి నాకు కలిగింది - "నేను సాయం చేసిన మాట నిజమే! అయితే ప్రతిఫలాపేక్ష లేకుండా ఎవడు మాత్రం సాయం చేస్తాడు? ప్రతిఫలంగా

నేను మీనాక్షిని, అదైనా ఒక్కసారికే, కోరుకుంటున్నాను. అంతకు మించి శాస్త్రి ఏమీ ఇవ్వలేడు. ఈ విధంగా శాస్త్రిని ఋణవిముక్తుణ్ణి చేసినట్లూ అవుతుంది."

"మీనాక్షిని మరొకరి సొత్తుగా చేయడానికి సాయంచేసినప్పుడు ఆమె నీ సొత్తు కావాలనుకోవడం, ఆమె జీవితాన్ని నాశనం చేయడమే కదూ."

"కాదు - అంతా చీకట్లో మూడో కంటి వాడికి తెలీకుండా రహస్యంగా జరిగిపోతుంది. అందువల్ల ఆమె జీవితం నాశనం కానివ్వను."

"ఏదేమయినా ఇది అన్యాయం. నీవు చేశాననుకుంటున్న మంచి పనివల్ల నీకు సంతృప్తి లభించదు."

"అసంతృప్తి విషయమెలా ఉన్నా, ముందు మీనాక్షిని అనుభవిస్తేగానీ తృప్తి లేదు నాకు."

ఇలా అంతర్యుద్ధం సాగిన కొద్దిసేపట్లోనే మీనాక్షిని అనుభవించాలనే నిర్ణయానికి వచ్చాను నేను. తలచుకుంటేనే నా హృదయం పరవశించింది. ఇటువంటి విషయాల్లో నాకు సాయపడగల అనుయాయుడు హుస్సేన్‌కు అప్పజెప్పాను - ఎలాగైనా 'చీకటి గది' కి మీనాక్షిని తీసుకువచ్చేపనిని.

'చీకటి గది'లో నేను చాలా మంది అమ్మాయిలను అనుభవించాను కానీ ఈనాటి మీనాక్షి పొందుతో ఆ గదికే ఒక సార్థకత లభించబోతోంది.

ఆ రోజు రాత్రి.....

అంతా కటిక చీకటి. నాకు పరమ నేస్తమయిన కటిక చీకటి లోకమంతా ఆవరించుకుని ఉంది. చీకటి ఇక నాతో శాశ్వతంగా స్నేహం చేయబోతోందనీ, చీకటికీ నాకూ అవినాభావ సంబంధం ఏర్పడబోతోందనీ, తెలియని నేను... నా చీకటి గదికి బయల్దేరాను. తన సమక్షంలో చీకటిని చెల్లాచెదరు చేసే అందాల బాల మీనాక్షి దగ్గరకు వెడుతున్నాననుకున్నానుగానీ, చీకటిని శాశ్వతంగా నాతో ఉంచుకునేందుకు వెడుతున్నానని అనుకోలేదు.

హుస్సేన్ అసాధ్యుడు. మీనాక్షిని బలవంతంగా తీసుకొచ్చి చీకటి గదిలో ఉంచాడు.

నేను వెళ్లాను, చీకటి గది తలుపులు తెరిచాను. మంచం మీద కూర్చుని ఉంది మీనాక్షి. వెంటనే గడియ వేశాను. మీనాక్షి తేజస్సు ముందు గదిలోని దీపపు కాంతి సూర్యుడి ముందు దివిటీలా అయింది.

తలుపు చప్పుడవడంతోనే, మీనాక్షి అటు ఉన్న దల్లా ఇటు నాకేసి తిరిగింది. నాకాశ్చర్యం కలిగింది. అమె ఏడుస్తోంది.

"అదేమిటి మీనా, ఏడుస్తున్నావ్?" అన్నాను.

నా సంభోదన నాకు అశ్చర్యం కలిగించినప్పుడు ఆమె అశ్చర్యపోవడంలో వింతలేదు, ఆశ్చర్యం ఆమె దు:ఖాన్ని కొంత తగ్గించింది. 'మీకిది న్యాయం కాదు. నన్ను వది లేయండి' అంది.

ఆమె మాటలు నన్ను ముగ్దుణ్ణి చేశాయి. రూపానికి తగ్గ గొంతు అనుకుంటూ, "ఒక గంటలో నిన్ను వదిలేస్తాను. అబ్బ, రెండు దీపాల వెలుగులో నా కళ్ళు చెదిరిపోతున్నాయి. ఒక దీపం తీస్తాను" అంటూ స్విచ్ ఆఫ్ చేశాను. దీపం అరిపోయి గదంతా చీకటయ్యింది.

మీనాక్షి సౌందర్యం కంటి ముందునించి అదృశ్యమయింది. ఎంత కాంతివంతమైన శరీరమైనా, ఆ చీకట్లో ఆమె నాకు కనిపించలేదు. ఆమె సౌందర్యం చూడ్డానికి దీపముండడం అవసరమనుకొని వెంటనే దీపం వేశాను.

కాస్సేపు మా ఇద్దరి మధ్యా మాటలు లేవు. ఇద్దరం ఒకరివైపొకరం చూసుకున్నాము, కొంత సేపు గడిచాక నేనామెను సమీపించాను.

ఆమె వణుకుతోంది. కానీ మాట్లాడలేదు. నేను నెమ్మదిగా అన్నాను. - "కంగారు పడకు, నీకెంత కావాలంటే అంత డబ్బిస్తాను. ఒక్క గంట నేను చెప్పినట్లు వినాలి."

వెంటనే జవాబిచ్చింది మీనాక్షి, "నాకు డబ్బేమీ అక్కరలేదు, మీరు నాన్నగారికిచ్చిన డబ్బు కూడా ఇప్పించేస్తాను. నన్ను వదిలేయండి."

నేనాశ్చర్యపోయాను. డబ్బుకి లొంగని వాళ్లుండరని నా ఉద్దేశ్యమూ, అనుభవమూ కూడాను. మరి ఈ మీనాక్షి ఏమిటి? పసితనమేనా అయుండాలి, లేదా బెట్టు చేస్తూ అయినా ఉండిఉండాలి. రెండోది సరయిన అభిప్రాయమనే ఉద్ధేశ్యంతో ఆమె చేయి పట్టుకున్నాను.

మంత్రగాడు పాము తోక బట్టి విదిలించినట్లు ఆమె నా చేతిని విదిలించింది. నా చేతి ఎముకలు జారిపోయాయా అనిపించేటంతలా ఆమె విదిలించడంతో, ఆమె చేస్తున్నది బెట్టుకాదని గ్రహించాను. కానీ ఆమె స్పర్శతో ఆ క్షణంలో కలిగిన అనుభూతి నా చేత ముందడుగు వేయించింది. మళ్ళీ ఆమె చేయి పట్టుకున్నాను బలంగా. ఈ సారి నా దవడ ఆమె ఎడమ చేతి బలాన్ని రుచి చూడడమూ, స్త్రీలు అబలలు కారని నేను గ్రహించడమూ ఒక్కసారే జరిగాయి. దాంతో నాకు కోపం వచ్చింది. ఇటువంటి అవమానాన్ని నేనెన్నడూ ఎరగను. ఇంత సేపూ మంచిగా వ్యవహరించాను, మంచితనానికి ఆస్కారం లేనప్పుడు.....

నేను ఆలోచిస్తూండగానే మీనాక్షి తలుపు దగ్గరికి పరుగెట్టి తలుపు గడియ తీసింది. ఇంతలో నేను వెళ్ళి ఆమెను పట్టుకున్నాను. మళ్ళీ ఆమె చేయే నాకు దొరికింది. ఒక చేయి పట్టి రెండో చేత్తో దగ్గరకు లాక్కున్నాను.

"అరుస్తాను", అంది ఆమె.

ఆమె ఊపిరి నాకు అంత దగ్గర్లో తగుల్తుంటే, ఆమె శరీరం వెచ్చగా నన్నంటుకుని ఉంటే, ఈ లోకంలో నేను లెక్కచేసేవి వేరే వుంటాయా? అయినా, "ఇది ఊరి చివర బంగళా. ఇక్కడ నీవూ, నేను తప్ప మరెవ్వరూ లేరు. అరిచి గీపెట్టినా ప్రయోజనముండదు' ' అన్నాను.

ఆమెను హృదయానికి హత్తుకున్నాను. నా శరీరం వశం తప్పుతోంది. నాలో ఉద్రేకం ఎక్కువ యిపోతోంది. ఆ క్షణంలో....

ఉలిక్కిపడి మీనాక్షిని వదిలేశాను, ఆమె నన్ను గట్టిగా కరిచేసి నేను వదలగానే పారిపోయింది. ఆమె కూడా పరుగెట్టినా అందడంలేదు.

ఇటువంటి అనుభవం ముందే ఊహిస్తే నేనింకా జాగ్రత్తలు తీసుకొని ఉండేవాడిని. గత జలసేతు బంధనం, నాలో కోరిక విజృంభిస్తున్న తరుణంలో మీనాక్షి పారిపోయింది. ఎలాగైనా ఆమెను పట్టుకోవాలి, శక్తినంతనీ కూడ గట్టుకొని పరుగెత్తాను....

గాలిలో ఎగురుతున్న ఆమె పైటను అందుకోవడంతో ఆమె ఉలిక్కిపడి వెనక్కు

తిరిగింది. నేను పైటకొంగు పట్టుకుని గట్టిగా లాగాను. జరగబోయేదేమిటో గ్రహించి, "రోడ్డు మీద అలా చేయవద్దు అంటూ" నా దగ్గరకి వచ్చింది. ఆమె కళ్ళలోని ప్రార్థన నన్ను కదిలించగా, పైట చెంగును వదిలేశాను ఆమె చీర సరిగ్గా కట్టుకొని నా దగ్గరకు నవ్వుతూ వచ్చింది. నేను చేతులు చాచ బోయాను. ఆమె దగ్గరకు వచ్చినట్లే వచ్చి నన్ను ఒక్క త్రోపు తోసింది. అనుకోని ఈ ప్రమాదానికి వెల్లకిల్లా పడ్డాను. తల అదిరిపోయింది. లేద్దా మనుకునేలోగా మీనాక్షి వంగి కసిగా నా ముఖం మీద గట్టిగా చేతులతో కొట్టసాగింది. ఆమె చేతిగాజులు నా నుదుటి మీద తగిలాయి, నాకు స్పృహ తప్పింది....

★ ★ ★

చేసిన తప్పుల్ని పశ్చాత్తాపం కడిగేస్తుందన్న మాట నిజమే... కాని ఓ సమయం దాటాక పశ్చాత్తాపం కూడా మనలను రక్షించలేదు.

ఇప్పుడు నాకు జీవితమే చీకటి. నా కంటికి చీకటి తప్ప మరింకేమీ కనిపించదు. నేనెంతో అభిమానించే చీకటి ఇప్పుడు నాతో శాశ్వత సంబంధం ఏర్పరచుకుంది.

నా వ్యాపారాలన్నీ ఇప్పుడు నడుస్తూనే ఉన్నాయి, కానీ వాటిలోని చీకటిని నేను తొలగించి, న్యాయమార్గాన వ్యాపారాన్ని సాగిస్తున్నాను.

నేను చీకటిగా భావించే నా భార్య, ఇప్పుడు నాకు వెలుగయింది. ఇంతకాలం ఆమెను ఎం దుకు గుర్తించలేకపోయానో నా కిప్పుడర్థమయ్యిం ది. మనం సాధారణంగా కళ్ళతో చూస్తాం. అదే మనం చేసే పొరపాటు. మనం మనస్సుతో చూడ్డం నేర్చుకోవాలి, అప్పుడే మంచి చెడ్డల తారతమ్యాన్ని సరిగ్గా తెలుసుకోగలుగుతాం, పూర్వం నా మన స్సులో చీకటి ఉండేది, ఆ మనస్సు వసుంధరలోని వెలుగును చూడలేకపోయింది.

అయితే, మనస్సుతో చూడడం నేర్చుకోమని నేను చెప్పడం బాగుండదు. ఎందుకంటే నేను చేయగలిగింది అదొక్కటే కనుక. అలా చెబుతానని అంతా అనుకోవచ్చు. నా కళ్ళకు చూసే శక్తి లేదు. మూసినా తెరిచినా వాటికి కనిపించేది చీకటి మాత్రమే! మీనాక్షి నా కంటి నుండి వెలుగును దూరం చేసింది. కానీ అదే సమయంలో నాలోని విజ్ఞాన నేత్రం తెరుచుకుంది.

పసితనంలో పిల్లలు చీకటి కెందుకు భయపడతారో నా కిప్పుడర్థమయ్యింది. చెడ్డతనానికీ, చీకటికీ చాలా సంబంధం ఉంది. అమాయకులైన పిల్లల మనసులో చెడ్డతనానికి తావులేదు. అందు వల్లనే చీకటికీ తావు లేదు. వయస్సు పెరిగే కొద్దీ వారికి చీకటి పట్ల, చెడ్డ పనుల పట్ల ఆకర్షణ పెరుగుతుంది. పసితనంలో చీకటంటే భయపడే నేను కోరి చీకటిని ఆహ్వానించినందుకు చీకటిచే జయించబడి చీకటికి బానిస కావలసి వచ్చింది.

అయినా నా కిప్పుడు విచారం లేదు. నీతి మార్గాన పోతున్నానన్న సంతృప్తి, నాకొక జీవిత భాగస్వామి తోడుగా ఉందన్న ధైర్యమూ నా కెటువంటి చింతనూ కలగనీయవు, ఒక్కరోజు ముందుగా నేను మారి ఉంటే ఈ గతి పట్టకపోవునే అన్న చింత తప్ప.

కానీ, నా కళ్ళెలాగ పోయిందీ మాత్రం ఎవరికీ తెలియదు. ఆ రహస్యం చీకటిలోనూ, చీకటి వంటి హుస్సేన్ మనసులోనూ, అపవాదుకు భయపడే మీనాక్షిలోనూ ఉండిపోయింది.★

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక - 19-4-'68).*